నేడు, రేపు శ్రీగిరిలో కార్తీకమాస పూజలు

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురు, శుక్రవారాల్లో పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి తెలిపారు. పాల్గొనదలచిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సోక్‌పిట్లు, క్యాటిల్ షెడ్ల నిర్మాణాలు

వేగవంతం చేయాలి



మద్దిపాడులో మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్, ఎంపీడీఓ జ్యోతి

- డ్వామా పీడీ జోసఫ్

మద్దిపాడు: మండలంలో మంజూరైన సోక్‌పిట్లు, క్యాటిల్ షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జోసఫ్ సూచించారు. బుధవారం సాయంత్రం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. షెడ్ల నిర్మాణాల విషయంలో మండలం వెనుకబడి ఉందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ లబ్ధిదారులు వేగంగా షెడ్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. సమావేశంలో ఎంపీడీఓ జ్యోతి, ఏపీడీ వెంకటస్వామి, టెక్నికల్ ఇంజినీర్ కిషోర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వామా పీడీ జోసఫ్ అధ్యక్షతన బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అత్యవసర సమావేశం నిర్వహించారు. పథకంలో మంజూరైన గోకులాల షెడ్లను వెంటనే ప్రారంభించి గ్రౌండింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. వచ్చే శనివారంలోగా షెడ్ల పనులు మొదలుపెట్టకుంటే వెంటనే రద్దుచేసి కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ పి.వెంకటస్వామి, ఏపీవో కే వాసంతి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు సామగ్రి బహూకరణ



విద్యార్థులకు వస్తువులు అందిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి సభ్యులు

చీమకుర్తి రూరల్: మండలంలోని బండ్లమూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు బహూకరించారు. మార్తుల బాలరెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా వారి కుమారులు వెంకారెడ్డి, తిరుపతిరెడ్డి బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి తరపున వాటిని అందించారు. హెచ్‌ఎం కాంతారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కడవా రామకృష్ణ, సెక్రటరీ కేవీ సుధాకర్, మాజీ ప్రెసిడెంట్, సెక్రటరీలు ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు, బండ్లమూడి వైస్ సర్పంచ్ గోపిరెడ్డి పద్మా ఓబుల్‌రెడ్డి, ఎంపీటీసీ యానం విజయలక్ష్మి శేషిరెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.1.80 లక్షల విలువైన వస్తువులు చోరీ

కొత్తపట్నం: గుర్తు తెలియని దుండగులు రూ.1.80 లక్షల విలువ చేసే వస్తువులను చోరీ చేసిన సంఘటన కొత్తపట్నం మండలంలోని మడనూరు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన కేశవరపు కృష్ణారెడ్డి కొత్తగా ఇల్లు నిర్మించుకోవడానికి పక్కనే ఉన్న ఇంటిలో చేరాడు. కొత్త ఇంటిని బేస్‌మట్టం వరకు నిర్మించాడు. తిరుపతిలో తన తమ్ముడి గృహప్రవేశానికి ఈ నెల 12వ తేదీ ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. కృష్ణారెడ్డి ఇంటిని నిర్మించే బేల్దారి మేస్త్రీ బుధవారం పనికి వచ్చి కృష్ణారెడ్డి ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని గమనించి ఫోన్ చేసి చెప్పాడు. మధ్యాహ్నానికి ఇంటికి చేరుకున్న కృష్ణారెడ్డి పరిశీలించగా, రంపం బ్లేడుతో తాళం చెవి కోసి ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువా తెరిచి అందులోని కేజీ వెండి వస్తువులు దొంగిలించారు. రెండు జతల బంగారు కమ్మలు, రూ.లక్ష నగదు దోచుకెళ్లారు. ఆ మేరకు కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌లో కృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. ఎస్సై సుధాకర్‌బాబు కేసు నమోదు చేసి డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి దర్యాప్తు చేపట్టారు.

ఉత్కంఠ భరితంగా..

- ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలతో పోటీల నిర్వాహకులు

ఒంగోలు: స్థానిక లార్డ్ కృష్ణ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అండర్-11 బాలబాలికల మినీ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగి ముగిశాయి. చిన్నారులు నువ్వా..నేనా అన్నట్లు చిచ్చరపిడుగుల్లా పోటీపడ్డారు. చిన్నారుల అద్వితీయ ప్రదర్శన ప్రేక్షకులను అబ్బురపరిచింది. బాలబాలికలు పదునైన షాట్స్, స్మాష్‌లతో ప్రతిభ చాటారు. ముఖ్యంగా బాలికలు బ్యాట్‌తో నైపుణ్యాన్ని ప్రదర్శించి క్రీడాభిమానుల మన్ననలు పొందారు. చివరి రోజైన బుధవారం ఉదయం సెమీ ఫైనల్స్, ఆ తర్వాత ఫైనల్స్ హోరాహోరీగా జరిగాయి. అండర్-11 బాలుర సింగిల్స్ ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నంకు చెందిన కే మోజెష్‌పై అనంతపురంకు చెందిన ఏ హర్షిత్ విజయం సాధించారు. బాలికల సింగిల్ ఫైనల్ మ్యాచ్‌లో ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్‌కే రబియాపై కృష్ణా జిల్లాకు చెందిన కియా విజయం సాధించారు.

బాలుర డబుల్స్‌లో విజేతలు వీరే...

బాలుర డబుల్స్ ఫైనల్ మ్యాచ్‌లో ఈస్ట్ గోదావరికి చెందిన శ్రీరామ్ సహంత్, కే కార్తీక్ సూర్య రాయ్‌పై ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్‌కే అఫన్, ఎస్‌కే యాశీర్ విజయం సాధించారు. బాలికల డబుల్స్ ఫైనల్ మ్యాచ్‌లో ప్రకాశం జిల్లాకు చెందిన ఎస్‌కే రబియా, కృష్ణా జిల్లాకు చెందిన కే ఆద్యపై విశాఖపట్నంకు చెందిన ఎలియస్ ప్రియాంక్, శ్రీ ప్రవ్య విజయం సాధించారు. మూడు రోజుల పాటు క్రీడాభిమానులతో సందడిగా మారి లార్డ్ కృష్ణ స్టేడియంలో పండుగ వాతావరణ నెలకొంది. ఫైనల్ మ్యాచ్‌లలో రన్నర్స్, విన్నర్స్‌కు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ శిద్దా సుధీర్‌కుమార్ అభినందనలు తెలిపారు. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ ట్రోఫీలతో పాటు ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సర్టిఫికెట్లు అందించారు.

జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు విజేతలు...

ముగింపు కార్యక్రమంలో అద్దంకి మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ మ్యాచ్‌లలో గెలుపొందిన వారు జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు క్వాలిఫై అయినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సహకారంతో అండర్-11 బాలబాలికల మినీ బ్యాడ్మింటన్ పోటీలను లార్డ్ కృష్ణ అకాడమీలో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారులకు, తల్లిదండ్రులకు, క్రీడాభిమానులకు, కోచ్‌లకు, అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని జాతీయ బ్యాడ్మింటన్ పోటీలను లార్డ్ కృష్ణ అకాడమీలో నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించేందుకు విదేశీ కోచ్‌లను ఏర్పాటు చేశామని, ఔత్సాహిక క్రీడాకారులకు బ్యాడ్మింటన్ శిక్షణ ఇచ్చి వారిని ఉత్తమ బ్యాడ్మింటన్ క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యత లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో మ్యాచ్ చీఫ్ రెఫరీ టి.కృష్ణప్రసాద్, అద్దంకి రాధాకృష్ణమూర్తి, ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి విజయకృష్ణ, లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ ట్రెజరర్ ఏ పద్మప్రియ, సభ్యులు రఘుబాబు, దండు శ్రీనివాసరావు, కోడె శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేస్తే దేవుడికి చేసినట్లే..



కేక్ కట్ చేస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్లు

ఒంగోలు టౌన్ : ప్రజలకు సేవ చేయడమంటే దేవుడికి సేవ చేసినట్లేనని స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు అన్నారు. బుధవారం మెడికల్ కాలేజీలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు సేవ చేసే అరుదైన అవకాశాన్ని వైద్యులకు ఆ దేవుడు ఇచ్చాడని చెప్పారు. ప్రేమపూర్వక సమాజమే లక్ష్యంగా విద్యార్థులు పని చేయాలన్నారు. కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, అనాటమి హెచ్‌ఓడీ డా.సుధాకర్ బాబు, ఐఎంఏ రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ జాలాది మాణిబాబు పాల్గొన్నారు. అనంతరం దైవ సేవకుడు డాక్టర్ ప్రదీప్ సుందరం దైవ సందేశం వినిపించారు.

24న కళామిత్రమండలి వార్షికోత్సవం

ఒంగోలు మెట్రో: కళామిత్రమండలి (తెలుగు లోగిలి) 18వ వార్షికోత్సవాన్ని ఈ నెల 24వ తేదీ ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

గిరిజనులు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలి



మాట్లాడుతున్న సీఐడీ సీఐ హజరత్‌బాబు

కొత్తపట్నం: గిరిజనులు విద్య, వైద్యం, రాజకీయ, సామాజిక రంగాల్లో చైతన్యవంతులు కావాలని నెల్లూరు సీఐడీ సీఐ జి.హజరత్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని ఈతముక్కల గ్రామంలో మాధవరావు కల్యాణ మండపంలో బుధవారం నెల్లూరు సీఐడీ డిపార్ట్‌మెంట్ రీజినల్ ఆఫీస్ ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐడీ ఎస్సై సీహెచ్ ప్రభాకర్ అధ్యక్షత వహించగా, హజరత్‌బాబు మాట్లాడారు. అనంతరం గిరిజనులకు చట్టాలు, హక్కులు, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ మేడా శ్రీనివాసరావు, స్థానిక ఎస్సై వి.సుధాకర్‌బాబు, ఎంఈవో తులసీ కుమారి, ఆర్.వరకుమార్, ఏటీడబ్ల్యూవో ఏ.సుబ్బయ్య, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

సంతనూతలపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు స్థానిక గ్రంథపాలకుడు సత్యనారాయణ తెలిపారు. అందులో భాగంగా సంతనూతలపాడు జెడ్పీ హైస్కూల్లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రముఖులను స్మరించుట, కవి సమ్మేళనం, మాదక ద్రవ్యాలపై అవగాహన, దిశ చట్టంపై అవగాహన, డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్, లెమన్ స్పూన్ లేదా మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఒక్కోరోజు ఒక్కో అంశంలో పోటీలు ఉంటాయని వెల్లడించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని నాగులుప్పలపాడు, ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయాలలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకులు శ్రీనివాసులు, ప్రసాద్ తెలిపారు. 14న బాలల దినోత్సవం సందర్భంగా ప్రారంభ వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుట, కవి సమ్మేళనాలు, 17, 18 తేదీల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపట్నం: మండలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంటలను ఈడీ శ్యామల్, ఐఏఎస్, ఆర్‌టీడీ, హెల్త్ అండ్ న్యూట్రీషన్ లక్ష్మీదుర్గ బుధవారం పరిశీలించారు. రైతు సాధికారిక సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా పరిషత్ మేనేజర్ వి.సుభాషిణి ఆధ్వర్యంలో ముందుగా ఈతముక్కల వెంకటేశ్వరకాలనీలో అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలు, బాలింతలతో మాట్లాడారు. అనంతరం రాజుపాలెంలో ప్రకృతి వ్యవసాయం కిచన్ గార్డెన్స్ పరిశీలించారు. కొత్తపట్నంలో పులి ఆదిలక్ష్మి, చింత స్వప్న, పెనుకొండయ్య, హరిణి పొలాలను సందర్శించారు. రంగాయపాలెంలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, ఏపీఎం విజయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: మెగా డీఎస్సీ 2024 పరీక్షలకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ ఒంగోలు సంచాలకులు యం.అంజల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణకు నవంబర్ 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు 16వ తేదీ నుంచి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని, ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందిస్తారన్నారు. మొత్తం 220 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తమ పూర్తి బయోడేటాతో పాటు పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీఈడీ, టీటీసీ, టెట్ మార్కుల లిస్టు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, 2 పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో నవంబర్ 15వ తేదీలోపు కలెక్టర్ వారి కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ భవనాల సముదాయంలోని ఏపీబీసీ స్టడీ సర్కిల్, 08592231232, 9989285530 అనే నంబరును సంప్రదించాలన్నారు.

రైతులంతా పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలి

మద్దిపాడు: రబీ సీజన్‌లో పంటలు వేసిన రైతులు ఈ క్రాప్‌లో నమోదు చేయించుకుని పంటల బీమా రుసుం చెల్లించాలని ఏఓ రమేష్ సూచించారు. మండలంలోని నేలటూరు, పెదకొత్తపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి రైతులకు వివరించారు. 2024-25 సంవత్సరానికి ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలన్నారు. శనగ పంటకు ఎకరాకు రూ.368, మినుముకు రూ.103, వరికి రూ.215, మిరపకు రూ.525, మొక్కజొన్నకు రూ.105 ప్రీమియం చెల్లించాలన్నారు. పత్తి రైతు రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో ఆదాయం

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

సంతనూతలపాడు: పంట మార్పిడితో ఆదాయం పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు రైతులకు సూచించారు. మండలంలోని చిలకపాడు, పి.తక్కెళ్లపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా రైతులు తమ వాటా ప్రీమియాన్ని చెల్లించాలని, తద్వారా తాము సాగు చేసుకున్న పంట నష్టపోతే బీమా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా అపరాలు అయిన కంది, మినుము, శనగ, కొర్ర, సజ్జ తదితర పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. పొగాకు మార్కెట్ ధరలు స్థిరంగా లేని కారణంగా రైతులు నష్టపోకుండా ఉంటారని తెలిపారు. అనంతరం చిలకపాడు గ్రామంలో సాగుచేసిన మినుము పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.పావని, గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్ అఫ్జల్, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

చీమకుర్తి రూరల్: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ తెలిపారు. మండలంలోని గోనుగుంట, కేవీ పాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో రోజుకు రెండు గ్రామాల చొప్పున పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. ప్రతి పంట సాగులోనూ రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి ధనలక్ష్మి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆకుముడత పురుగు నివారణకు హైడ్రో క్లోరైడ్ గుళికలు వేసుకోవాలి...

ఒంగోలు సిటీ: వరి పొలాల్లో ఆకుముడత పురుగు ఉంటే దాని నివారణకు రైతులు కార్ట్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ గుళికలు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.కిషోర్‌బాబు తెలిపారు. బుధవారం ఒంగోలు మండలంలోని ఎస్.అగ్రహారం, చేజర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ముందుగా అగ్రహారం గ్రామంలో వరి పొలాలను పరిశీలించారు. చేజర్ల గ్రామంలో మినుము పంటను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు హిమబిందు, హలోకృష్ణవేణి, వ్యవసాయ విస్తరణ అధికారి రామకృష్ణారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ రాధా సింగమనేని, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధిపై రేపు శిక్షణ

చీమకుర్తి రూరల్: మండలంలోని 24 పంచాయతీల గ్రామ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ఈ నెల 15, 16 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ రాఘవేంద్ర తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 15వ తేదీ చంద్రపాడు, నేకునంబాదు, పల్లామల్లి, గాడిపర్తివారిపాలెం, ఇలపావులూరు, పడమటి నాయుడుపాలెం, బండ్లమూడి, తొర్ర గుడిపాడు, యర్రగుడిపాడు, మంచికలపాడు, దేవరపాలెం, నిప్పట్లపాడు, గ్రామాల వారికి శిక్షణ ఇస్తారన్నారు. 16న బూదవాడ, ఆర్ఎల్ పురం, చినరావిపాడు, పులికొండ, బూసరపల్లి, పిడతలపూడి, ఆర్‌సీ పురం, జీఎల్ పురం, గోనుగుంట, ఏలూరివారి పాలెం, మువ్వావారిపాలెం, కూనంనేనివారిపాలెం గ్రామాల వారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందని, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

బాలోత్సవాలు పక్కాగా నిర్వహించాలి



వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: బంగారు బాల్యం కార్యక్రమం కింద ఈ నెల 14 నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న బంగారు బాలోత్సవాలు పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రకాశం భవనం నుంచి బాలోత్సవాల నిర్వహణపై మండల స్థాయి అధికారులతో బుధవారం వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ వారం పాటు నిర్వహించే బాలోత్సవాల్లో బంగారు బాల్యానికి శ్రీకారం-బాలోత్సవాలతో ప్రారంభం, మన హక్కులు తెలుసుకుందాం, మనకోసం మనం, మా పిల్లలు-మా బాధ్యత, సదా బాలల సేవలో, మా కలలు-మాస్వప్నాలు, చేయి చేయి కలుపుదాం-బంగారు బాల్యాన్ని అందిద్దాం అనే ఇతివృత్తాలతో ప్రత్యేక కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. దీనిలో స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేయాలని ఆదేశించారు. బాలల చట్టాలు, హక్కులు వాటి పరిరక్షణ, ప్రభుత్వ పథకాలు పొందేందుకు అర్హతలు వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ చిన ఓబులేసు, ఐసీడీఎస్ పీడీ మాధురి, డీఈఓ కిరణ్‌కుమార్, మెప్మా, డీఆర్‌డీఏ పీడీలు రవికుమార్, వసుంధర, డీఎంహెచ్‌ఓ సురేష్, కార్మిక డిప్యూటీ కమిషనర్ గాయత్రీదేవి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, బీసీ సంక్షేమ అధికారి అంజల ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. బంగారు బాల్యం కార్యక్రమం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కలిసిరావాలని కోరారు. బంగారు బాలోత్సవాలను పండుగ వాతావరణంలో అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని సూచించారు.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు అభిలాష



జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన కొప్పోలు అభిలాష

ఒంగోలు: జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఒంగోలుకు చెందిన కొప్పోలు అభిలాష ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో ఆర్చరీ విభాగంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన ఈమె ఈనెల 18న గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొననుంది. 6వ తరగతి చదువుతున్న అభిలాష జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా విద్యార్థినికి కేఎంఎస్ పాఠశాల కరస్పాండెంట్ వసుంధరాదేవి, ప్రిన్సిపాల్ లక్ష్మీ జాహ్నవి అభినందనలు తెలిపారు.